క్లుప్తంగా

అత్యవసర వేళ రక్తదానం

అమలాపురం టౌన్: అమలాపురం కిమ్స్ హాస్పిటల్ ఐసీయూలో అత్యవసర వైద్యం పొందుతున్న ఓ మహిళకు 'ఓ-వీఈ' రక్తం అత్యవసరం కావడంతో మున్సిపల్ కమిషనర్ కేవీవీఆర్ రాజు స్వయంగా బుధవారం రాత్రి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితి నుంచి ఈ రోగిని కాపాడారు. నాలుగు రోజుల క్రితం వరకూ అమలాపురం మున్సిపల్ కమిషనర్గా పనిచేసి బదిలీపై రామచంద్రపురం కమిషనర్గా వెళ్లిన రాజు ఓ మహిళా రోగికి రక్త అవసమన్న చెప్పగానే హుటాహుటీన అక్కడ నుంచి వచ్చి రక్త దానం చేశారు. మున్సిపల్ కమిషనర్ను వైద్యులు, రోగి బంధువులు అభినందించారు.

వ్యవసాయ భూమి తగ్గుదలపై ఆందోళన

యానాం: పట్టణీకరణ నేపథ్యంలో పుదుచ్చేరిలో నాలుగు రీజియన్లలోనూ సాగుభూమి క్రమేణా తగ్గుతోందని సీఎం రంగసామి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పుదుచ్చేరిలో విలేకరులతో మాట్లాడుతూ కోపరేటివ్ సొసైటీలు ఉన్నప్పటికి అవి సరైన రీతిలో పనిచేయడం లేదని, దీనిపై పలువురు ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేవనెత్తుతున్నారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కోపరేటివ్ సొసైటీలు, అసోసియేషన్లు నష్టాలపాలై మూసివేశారన్నారు. బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ కోపరేటివ్ సొసైటీలను గాడిలో పెట్టినట్లు తెలిపారు. స్పీకర్ సెల్వం, ఎ.భాస్కర్, గుణశేఖరన్ పాల్గొన్నారు.

డీటీ పోస్టుల కేటగిరీ వివరాల వెల్లడి

యానాం: 30 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులకు సంబంధించి రిజర్వేషన్ వివరాలను, వయసు సడలింపు తదితర వివరాలను శుక్రవారం అధికారులు వెల్లడించారు. జనరల్-12, ఈడబ్ల్యూఎస్-3, ఎంబీసీ-5, ఎస్సీ-5, ఓబీసీ-3, బీసీఎం (ముస్లిం)-1, ఈబీసీ-1, మద్రాసు హైకోర్టు ఇటీవలి ఇచ్చిన తీర్పు మేరకు అదనంగా దివ్యాంగులకు-1 పోస్టు కేటాయించారు. ఇప్పటికే అభ్యర్థులకు పరీక్షల సిలబస్ను వెల్లడించినట్లు పుదుచ్చేరి కలెక్టర్ కులొంగొత్తన్ తెలిపారు. జూన్ 27లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు వీరేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామివారి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకంఠం గిరిబాబుశర్మ నేతృత్వంలో విఘ్నేశ్వర పూజ, పంచామృతాభిషేకాలు, పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకం, అన్నాభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కులగణన తప్పనిసరి

యానాం: వివిధ వర్గాల ప్రాతినిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి కులగణన చాలా అవసరమని, ఈ ప్రక్రియ సామాజిక న్యాయాన్ని బలోపేతం చేస్తుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత సహాయ మంత్రి రాందాస్ అథావాలే పేర్కొన్నారు. గురువారం పుదుచ్చేరిలో విలేకరులతో మాట్లాడారు. కులగణన ప్రక్రియ కీలకమైన డేటాను అందిస్తుందని, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం విధానాలను రూపొందించడంలో ప్రభుత్వానికి సహాయపడుతుందన్నారు. ప్రతి కులానికి సాధికారిత కల్పించడం అనేది వారి వాస్తవిక స్థితిని తెలుసుకున్నప్పుడే సాధ్యమవుతుందని అన్నారు.

3 నుంచి సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం

అమలాపురం టౌన్: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఏప్రిల్ 25న పుట్టపర్తి నుంచి ప్రారంభమైన ప్రేమ ప్రవాహిని రథోత్సవం జిల్లాలో జూన్ 3 నుంచి 6వ తేదీ వరకూ జరుగుతుందని సత్యసాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ అడబాల కొండబాబు తెలిపారు. అమలాపురంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. సత్యసాయి రథం అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పర్యటిస్తుందన్నారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించాలి



గోడిలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ సత్యనారాయణ

ఉప్పలగుప్తం: మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించాలని జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. దృష్టి లోపం, వినికిడి, మానసిక రుగ్మతలు, నడవలేని, ఆటిజామ్, యాసిడ్ ఎటిక్, తలసేమియా కలిగిన పిల్లలను గుర్తించే విధంగా 15 రోజుల నుంచి జూన్ వరకు ఐఈఆర్పీ సిబ్బంది సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గోడి గ్రామంలో ఐఆర్ఈపీ కేంద్రంలో జరుగుతున్న సర్వేను కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు.

డెలివరీ చార్జీల గుదిబండ

- అదనపు ధరలకు గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు
- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్లో విక్రయాలు
- ఎంఆర్పీపై రూ.100 వసూలు



కొత్తపాలెంలో గ్యాస్ డెలివరీ చేస్తున్న ఇండేన్ గ్యాస్ సిబ్బంది

కాట్రేనికోన: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేద మహిళలకు గ్యాసు సిలిండర్లు తక్కువ ధరలకు అందించాలనే లక్ష్యం సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అభాసుపాలవుతోంది. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాలలో సిలిండర్లు గ్యాసు ఏజెన్సీల నుంచి సరఫరా అవుతున్నాయి. కాట్రేనికోన మండలంలో ఇండేయన్ గ్యాసు ఏజెన్సీ నుంచి మండల పరిధిలోని వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం ఎల్పిజీ గ్యాసు 14.2 కేజీల డోమెస్టిక్ సిలిండరు ధర రూ.877. 50, 19 కేజీల కమర్షియల్ సిలిండరు ధర రూ.1,906, 5 కేజీల సిలిండరు ధర రూ.326కు సరఫరా చేస్తున్నారు. గ్యాసు సిలిండరును ఉచితంగా సరఫరా చేయాల్సి ఉన్నా ఎవరూ పాటించడం లేదు. గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ బాయ్స్కు జీతాలు, భత్యాలు ఇవ్వకపోవడంతో అదనపు డెలివరీ చార్జీలు వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టయింది.

డెలివరీ పేరుతో రూ.100 అదనపు చార్జీల వసూలు

గ్యాస్ సిలిండర్లును బుక్ చేసుకున్న వినియోగదారులకు ఉచితంగా డెలివరీ చేయవలసి ఉంది. అయితే కాట్రేనికోన మండలంలో ఇండేన్ గ్యాస్, ఉప్పలగుప్తం , ముమ్మిడివరం హెచ్పీ గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లను సరఫరా చేస్తున్నారు. ఎంఆర్పీపై రూ.80 నుంచి రూ.100 అదనంగా డెలివరీ చార్జీలు పేరుతో వసూలు చేస్తున్నారు. ఇటీవల కొత్తపాలెంలో ఇండేన్ గ్యాస్ డెలివరీ బాయ్ సిలిండర్పై రూ.100 అదనంగా ఇవ్వమని అడగటంతో ఒక మహిళ నిలదీసింది. డెలివరీ జార్జీలు వసూలు చేయవద్దని గ్యాస్ ఏజెన్సీల మీటింగ్లో జాయింట్ కలెక్టర్ చెప్పినా యథేచ్ఛగా వసూలు చేస్తున్నారు.

నల్లబజారులో సిలిండర్ల అక్రమ అమ్మకాలు

కాట్రేనికోన మండల పరిధిలోని కాట్రేనికోన, దొంతికుర్రు, పల్లంకుర్రు, కందికుప్ప, పల్లం, చెయ్యేరు కిరాణా షాపులు, షోడా బడ్డీలలో గ్యాస్ అక్రమ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ గ్యాస్ అమ్మకం దారులు 10 నుంచి 20 అక్రమ సిలిండర్లు వేరువేరు పేర్లతో సమకూర్చుకుని, వినియోగం తక్కువగా ఉన్న వారి సిలిండర్లపై బుక్ చేసుకుని అక్రమ అమ్మకాలు చేస్తున్నారు. బ్లాక్లో అమ్మకాలు చేస్తున్న వ్యాపారులు డెలివరీ బాయ్స్కు రూ.50 అదనంగా చెల్లించవలసి వస్తోంది. వీరు బ్లాక్ మార్కెట్లో సిలిండరుకు రూ.150 అదనంగా వసూలు చేస్తున్నారు.

హోటల్స్, తోపుడు బండ్లలో డొమెస్టిక్ సిలిండర్లు

మండలంలో హోటల్స్, పలావ్ సెంటర్లు, తోపుడు బండ్లలో కమర్షియల్ సిలిండర్లు వాడవలసి ఉన్నా , డొమెస్టిక్ సిలిండర్లను మాత్రమే వాడుతున్నారు. అధికారులు నెలవారీ వసూళ్ల కారణంగా తనిఖీలు చేయడం లేదు. గ్యాస్ సిలిండర్లను తూనికలు, రెవెన్యూ, సివిల్ సరఫరా శాఖలతో పాటు క్వాలిటీ చెకింగ్ అధికారులు తనిఖీ చేయడం లేదు.

అదనపు ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు

గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ చార్జీల పేరుతో అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. డెలివరీ చార్జీలు వసూలు చేయవద్దని, జిల్లా స్థాయి అధికారులు గ్యాస్ ఏజెన్సీలకు ఇప్పటికే చెప్పారు.
– ప్రసన్న జ్యోతి, ఎంఎస్ఓ, కాట్రేనికోన

ఘనంగా రుద్రహోమం



వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం

ఐ.పోలవరం: వైశాఖ మాసం ఆరుద్ర నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మురమళ్ళ శ్రీ వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం రుద్ర హోమం నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాదన అనంతరం రుద్ర హోమం, పూర్ణాహుతి కార్యక్రమం జరిపారు. ప్రతి నెలా ఆరుద్ర నక్షత్రం రోజున రుద్ర హోమం కార్యక్రమాలు భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరపున నిర్వహిస్తారు. 17 మంది రుద్రహోమంలో పాల్గొన్నారు. కార్యానిర్వాహణాధికారి మాట్లాడుతూ నిత్య, మాస, వార్షిక పూజలు, ఈ హుండీ, డొనేషన్, ఈ విరాళాలు దేవదాయశాఖ వెబ్సైట్ ।ఏపీ టెంపుల్స్.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏర్పాట్లు సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబు సభను బహిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు అధ్యక్షుడు రేవు శీను, నాయకులు

- మాల మహానాడు అధ్యక్షుడు రేవు శీను

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముఖ్య అతిథిగా ముమ్మిడివరం నియోజకవర్గంలో ఈ నెల 31న నిర్వహించే సమావేశాన్ని మాలలు బహిష్కరించాలని మాల మహానాడు అధ్యక్షుడు రేవు శీను డిమాండ్ చేశారు. ఐ పోలవరం మండలం మాలమహానాడు ఆధ్వర్యంలో మండల మాల మహానాడు అధ్యక్షుడు రేవు శీను అధ్యక్షతన ఒడ్డు చెరువు అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఏ ఒక్క మాల, మాల మహిళలు గాని ఆ సభకు హాజరుకాకుండా బహిష్కరించాలని ఐ పోలవరం మాల మహానాడు పిలుపునిచ్చింది. ఎందుకంటే మాలలపై కక్ష సాధింపు చర్య చేస్తూ వర్గీకరణను వేగవంతంగా చేయడానికి పూనిన ముఖ్యమంత్రి మాల ద్రోహి అని సమావేశం తీర్మానించింది. తెనాలిలో దళిత యువకులపై పోలీసులు చేసిన దౌర్జన్యాన్ని ఖండిస్తూ, ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. వడ్డీ గౌతం, కాశి పరివాజ్ కుమార్, మట్టగదన వీరుడు, మార్త శ్రీను, నాగబత్తుల రామకృష్ణ, ములపర్తి శ్రీను, పండు చంద్రరావు కాశి ధర్మేంద్ర కుమార్, గుట్టాల ప్రసాద్, సాధనల బాబురావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

అమలాపురం రూరల్: మండలంలో ఈదరపల్లిలోని బొంతువారిపేట చర్చి వద్ద విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. విద్యుత్ స్తంభం పడిపోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులకు స్తంభం సరిచేయాలని మొర పెట్టుకున్నా పట్టించుకోవట్లేదని స్థానికులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. ఈదరపల్లి వంతెన మూసివేయడంతో ఆటోలు, వాహన దారులు బొంతువారిపేట మీదుగా వెళుతున్నారు. విద్యుత్ స్తంభం జనంపై పడితే ప్రమాదం జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాస్కెట్బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు

యానాం: స్థానిక బాలయోగి క్రీడామైదానంలో గురువారం బాస్కెట్బాల్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మల్లాడి అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న బాస్కెట్బాల్ టోర్నీని మున్సిపల్ మాజీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం యానాంలో బాస్కెట్బాల్ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా వారిని జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఇటువంటి టోర్నీలు ఉపకరిస్తాయన్నారు. టోర్నీలో విజేతకు రూ.20వేలు, రన్నర్స్కు రూ.10వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. బాస్కెట్బాల్తో పాటు క్యారమ్స్, చెస్, క్రికెట్ పోటీల్నీ సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ సీఐ శివగణేష్, రిటైర్డ్ డీఎస్పీ (సీఐఎస్ఎఫ్) సత్యనారాయణ, రిఫరీలు చింతా రామకృష్ణ, మోహన్, రమేష్, రక్ష హరి కృష్ణ, అజయ్ పాల్గొన్నారు.

శ్వాసపై ధ్యాసతో ఆరోగ్యానికి బాటలు

- కలెక్టర్ మహేష్కుమార్



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ మహేష్కుమార్, జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: శ్వాసపై ధ్యాసతో తనువు మనసును ఏకంచేసి సుసంపన్న ఆరోగ్యానికి బాటలు వేసే యోగా ఔన్నత్యాన్ని ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికీ చేరువచేసే ఉద్దేశంతో నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ వెల్లడించారు. గురువారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 1,600 మంది రైతులతో యోగా అభ్యాసనాల కార్యక్రమం యోగా గురువులు ఆయుష్ వైద్యుల ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 6,000 మంది రైతులతో యోగా అభ్యసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ మరో ముగ్గురిని ప్రోత్సహిస్తూ యోగా ఖ్యాతిని విశ్వవ్యాపితం చేయాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక దేవాలయాలలో యోగాంధ్ర అభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయుష్ వైద్యాధికారి విజయ్ కుమారి, డీఆర్ఓ రాజకుమారి, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, డీఈవో సలీంబాషా, జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, డీఆర్డీఏ పీడీ గాంధీ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, యోగా గురువు ప్రసాద్, రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాచుపాము హల్చల్



తాచుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ వర్మ

అంబాజీపేట: సుమారు ఆరు అడుగుల గోధుమ రంగు తాచుపాము బుధవారం స్థానిక విజ్జపు వెంకటరాజు ఆయిల్ మిల్లులో చేరి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. అప్రమత్తమైన వెంకటరాజు వెంటనే స్నేక్ క్యాచర్ వర్మను సంప్రదించారు. ఆయన అక్కడకు చేరుకుని రేకుల కింద నక్కిన తాచుపామును పట్టుకుని, డబ్బాలో బంధించారు. ఆ పామును నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు. ఇది చాలా ప్రమాదకరమైన పాము అని వర్మ తెలిపారు. పాములతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

3 నుంచి అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

తాళ్లరేవు: మండల పరిధిలోని కాపులపాలెం గ్రామంలో పునర్నిర్మించిన శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామివారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు మే 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 3వ తేదీ గణపతి పూజ, యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, దీక్షా ధారణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 4వ తేదీన వాస్తుపూజ, వాస్తు హోమం, క్షీరాభిషేకం, జలాధివాసం, సమస్త దేవతారాధన, 5వ తేదీ ఉదయం 7.53 గంటలకు అయ్యప్పస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. శ్రీ వినాయకస్వామి విగ్రహ, శిఖర, కుమారస్వామి విగ్రహ, శిఖర, శ్రీ మాళికాపురత్తమ్మ అమ్మవారి విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, బలిపీఠం, ద్వార పాలకులు, ధ్వజస్తంభం, 18 మెట్ల ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలిబాట వంతెనపై ట్రాఫిక్ కష్టాలు



ఈదరపల్లి బొంతువారిపేట వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అమలాపురం రూరల్: ఈదరపల్లి వంతెన నిర్మాణం పనుల కారణంగా పాత వంతెనపై ట్రాఫిక్ నిలిపివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు మోటార్ సైకిళ్లు, ఈదరపల్లిలోని బొంతువారిపేట కాలిబాట వంతెనపై వెళ్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటంతో గురువారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను పేరూరు, బోడసకుర్రు, తొట్లపాలెం మీదుగా మళ్లించారు. ఈదరపల్లి వంతెన పనుల కారణంగా నల్లవంతెన, ముక్కామల బైపాస్ రోడ్లు మూసివేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, లారీలు నల్లవంతెన, ముక్తేశ్వరం మీదుగా రావులపాలెం వరకు మళ్లిస్తున్నారు. బొంతువారిపేట రోడ్డుపై ప్రతీరోజు ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈదరపల్లి అయ్యప్ప ఆలయం వద్ద తాత్కాలింగా వంతెన ఏర్పాటు చేశారు. అయితే ఆటోలు అమలాపురం ఆర్టీసీ బస్సు స్టాండ్కు వచ్చేందుకు బొంతువారిపేట వంతెన మీదుగా రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ను ఏర్పాటు చేసి బొంతువారిపేట వంతెన వద్ద ట్రాఫిక్ను మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు.

విగ్రహావిష్కరణ వివాదానికి తెర

అధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో సద్దుమణిగిన వైనం



అంతర్వేదికరలో పరిస్థితులను సమీక్షిస్తున్న డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే



రంగా విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య రంగా విగ్రహావిష్కరణలో తలెత్తిన వివాదానికి తెరపడింది. గురువారం ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో.. ఆయా వర్గాల వారితో అమలాపురం ఆర్డీఓ కొత్తమాధవి, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ జరిపిన చర్చలు ఫలించాయి. చర్చల్లో ఇరు సామాజిక వర్గాలు సామరస్య వాతావరణంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. రంగా విగ్రహం సరైన రీతిలో ఇరువర్గాలు సమష్టిగా ప్రారంభించేలా, క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 31న సీఎం పర్యటన పూర్తయ్యే వరకూ గడువు విధించి.. అధికారులు విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కొత్తపేట సెంటర్లో ఎల్ఎఫ్ చానల్పై ఉన్న కల్వర్టుకు ఒకవైపు అంబేడ్కర్ విగ్రహం ఇప్పటికే ఏర్పాటు చేశారు. రెండో వైపు బస్టాండ్కు చేరి రంగా విగ్రహం ఏర్పాటుకు ఓ సామాజిక వర్గం ఇటీవల సన్నాహాలు చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో పంచాయతీ తీర్మానాన్ని అనుసరించి ఆ వర్గం ఈరోజు తెల్లవారుజామున రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. విగ్రహం ఏర్పాటుకు అధికారుల అనుమతి లేదంటూ, విగ్రహాన్ని తొలగించాలని మరో వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు వచ్చి శాంతిభద్రతల దృష్ట్యా విగ్రహాన్ని సమీప ఇంటి ఆవరణలోకి చేర్చారు. తెల్లవారాక తిరిగి అదే విగ్రహాన్ని యథాతథంగా ఆ వర్గం వారు పెద్దఎత్తున తరలివచ్చి మరోసారి ఆవిష్కరించారు. ఈ క్రమంలో గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం ముదిరింది. ఈ పరిస్థితుల్లో కొత్తపేట డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కోనసీమలోని పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, ఇరు వర్గాలను చెదరగొట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం వివాదం శాంతియుతంగా పరిష్కరించే క్రమంలో స్థానిక పంచాయతీలో ఇరు వర్గాలతో అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తినా, అధికారులు దఫదఫాలుగా వారికి నచ్చజెప్పి ఎట్టకేలకు ఓ అంగీకారానికి తెచ్చారు. కల్వర్టుకు ఓ వైపునున్న అంబేడ్కర్ విగ్రహం ఎత్తు కంటే తక్కువ ఎత్తులో అదే చోట రంగా విగ్రహం పెట్టడానికి మరో వర్గం సూత్రప్రాయంగా అంగీకరించడంతో చర్చలు సఫలమయ్యాయి. అయితే రంగా విగ్రహం దిమ్మ పక్కనే జాతీయ జెండా దిమ్మ కట్టడానికి అధికారులు తగిన నిర్ణయాలు తీసుకోవడానికి, అంతవరకూ రంగా విగ్రహానికి ముసుగు వేయడానికి అంగీకారానికి వచ్చారు. చివరగా డీఎస్పీ, ఆర్డీఓ, ఎమ్మెల్యే సమక్షంలో తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది విగ్రహానికి ముసుగు వేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా రావులపాలెం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణతో పాటు, పలు క్షేత్రాలను దర్శించుకునేలా ప్రత్యేక బస్సును జూన్ ఆరో తేదీన ఏర్పాటు చేసినట్టు రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ జీజీవీ రమణ గురువారం తెలిపారు. గిరి ప్రదక్షణతో పాటు, తిరుపతి, కాంచీపురం, శ్రీపురం, కాణిపాకం, శ్రీకాళహస్తి, విజయవాడ యాత్రకు సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామన్నారు. జూన్ ఆరున రావులపాలెం నుంచి బయలుదేరి, ఆయా క్షేత్రాల దర్శనం అనంతరం జ్యేష్ఠ పౌర్ణమి రోజున అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం 13వ తేదీన రావులపాలెం చేరుతుందని వివరించారు. ఐదు రోజుల యాత్రకు టికెట్ ధర రూ.3,500గా నిర్ణయించామన్నారు. వివరాలకు డిపో మేనేజర్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఆలమూరు: జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించే వరకూ రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన చేయకూడదంటూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ అన్నారు. ఆలమూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా విద్యారంగంలో అనేక సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. స్థానిక జూనియర్ కళాశాల శిథిలావస్థకు చేరినా, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. దీనివల్ల అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. పేద, బలహీన వర్గాలకు ఉచిత విద్య కొరవడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా సమస్యలపై ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి, సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

4న వెన్నుపోటు దినం

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- విజయవంతం చేయాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ఎన్నికల ముందు ప్రజలకు మాయ మాటలు చెప్పి, తీరా గెలిచాక సంక్షేమ పథకాలు ఇవ్వకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వ దగాకోరుతనానికి నిరసనగా మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినం పేరిట జూన్ నాలుగున జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో రాజోలు నియోజకవర్గానికి చెందిన 28 విభాగాల అధ్యక్షులు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళలను, రైతులను, యువతను, విద్యార్థులను పథకాల పేరుతో మోసం చేసిన చంద్రబాబు అండ్ కో దగాకోరు విధానాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. మోసపోయిన జనానికి అండగా నిలిచి పోరాడాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని చెప్పారు. అందుకే ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని, దగాపడ్డ సామాన్య ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, రాష్ట్ర నాయకులు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా నాయకులు కూనపరెడ్డి రాంబాబు, పాటి శివకుమార్, ఈద రవిరెడ్డి, తోటే జాన్బాబు, మోకా సురేష్, ఉచ్చులా విష్ణు, రాజోలు నియోజకవర్గ నాయకులు రుద్రరాజు రంగరాజు, ఉచ్చులా దాసు, జిల్లెళ్ల ఉదయ్, గుర్రం జాషువా తదితరులు పాల్గొన్నారు.